# బీటలు వారుతున్న వరిచేలు

- పంటలకు సాగునీటి ఎద్దడి
- 20 అడుగులకు తగ్గిన భూగర్భ జలాలు
- తాడిపూడికి సకాలంలో విడుదల కాని సాగునీరు
- ఆందోళన చెందున్న అన్నదాత

**దేవరపల్లి:** వరిచేలు బీటలు వారుతున్నాయి. కళ్లెదుట బీటలు తీసి ఎండిపోతున్న వరి పొలాలను చూసి అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వేసవిని తలపిస్తున్న వాతావరణం, మొహం చాటేసిన వరుణుడు, భూగర్భజలాలు పడిపోవడం వంటి కారణాలతో ఖరీఫ్ పంట సాగు ప్రశ్నార్థకంగా మారింది. జూన్ చివరి వారంలో కురిసిన వర్షాలకు రైతులు నారు మడులు పోసి బోర్ల క్రింద నాట్లు వేశారు. జూలై మూడో తేదీన తాడిపూడి ఎత్తిపోతల పథకం కాలువకు నీరు విడుదల చేయడంతో సాగునీరు వస్తుందనే ఆశతో రైతులు ఆయకట్టు భూముల్లో వరినాట్లు వేశారు. 3వ తేదీన ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని విడుదల చేసినప్పటికీ దేవరపల్లి 31వ కిలో మీటర్ వద్ద గల సబ్‌లిఫ్ట్ మోటారు మరమ్మతుల కారణంగా నీరు విడుదలను నిలుపుదల చేసి ప్రధాన పంపు హౌస్ వద్ద ఒక మోటారు ద్వారా నీటిని విడుదల చేశారు. ఈ నీటిని 21వ కిలో మీటరు వరకు సరఫరా చేయడంతో గోపాలపురం మండలం వరకు కొంత వరకు అరకొరగా నీరు చేరుకుంది. అక్కడ నుంచి కాలువకు నీరు సరఫరాలేకపోవడంతో పంట పొలాలకు సాగునీటి ఎద్దడి ఏర్పడింది. దాదాపు 10 రోజుల అనంతరం సోమవారం రాత్రి మూడు మోటార్ల ద్వారా గోదావరిలోని నీటిని ఎత్తిపోసి కాలువకు నీరు విడుదల చేశారు. పది రోజులు నీరు ఆలస్యం కావడంతో ఆయకట్టు పంట చేలు తడిలేక బీటలు తీసి ఎండిపోయాయని దేవరపల్లి మండలం కృష్ణంపాలెం రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీటలు వారి ఎండిపోతున్న వరిచేలను బుధవారం రైతులు ‘సాక్షి’కి చూపించి ఆవేదన చెందారు. బీటలు తీసిన చేలు కోలుకోవడం కష్టమని, కోలుకున్నా దిగుబడిపై ప్రభావం ఉంటుందని రైతులు వాపోతున్నారు. వర్షాలు లేకపోవడంతో భూగర్భ జాలాలు పడిపోయి మోటార్లు నీరు సరిగా తోడడం లేదని రైతులు తెలిపారు. 15 నుంచి 20 అడుగుల వరకు నీటి మట్టం తగ్గినట్టు చెబుతున్నారు. 160 అడుగుల్లో ఉన్న నీరు 180 అడుగులకు తగ్గినట్టు రైతులు తెలిపారు. ఇటువంటి దారుణమైన వాతావరణం ఎప్పుడు చూడలేదని రైతులు తెలిపారు. వర్షాకాలం వేసవిలా మారిందని రైతులు తెలిపారు.




దేవరపల్లి మండలం కృష్ణంపాలెంలో నీటి ఎద్దడితో బీటలు తీసిన వరిచేను (అంతర చిత్రం) నెర్రలు తీసిన పొలం

### సకాలంలో నీరు విడుదల కాకపోవడంతో..



తాడిపూడి కాలువకు సకాలంలో నీరు విడుదల కాలేదు. 10 రోజుల ముందు నీరు విడుదల చేస్తే చేలు దెబ్బతిని ఉండేవి కావు. వారం రోజులుగా నీటి ఎద్దడి ఏర్పడి చేలు నెర్రలు తీశాయి. బోర్లు కూడా సరిగా నీరు తోడక మరింత ఇబ్బంది ఏర్పడింది. జూన్ నెలాఖరులో వర్షాలు కురవడంతో వరినాట్లు వేశాను. మూడేకరాలు వరి చేను బీటలు తీసి ఉంది. ప్రతి ఏటా జూలై 1, 2 తేదీల్లో కాలువకు నీరు విడుదల చేస్తే ఆయకట్టు భూములకు ఇబ్బంది ఉండదు. పోలవరం కుడి కాలువతో పాటు తాడిపూడి కాలువకు నీరు విడుదల చేయాలి.

– కదలి చిరంజీవి, రైతు, కృష్ణంపాలెం, దేవరపల్లి మండలం

### సాగునీటి ఎద్దడి



పంటలకు సాగునీటి ఎద్దడి ఎక్కువగా ఉంది. వరుణుడు జాడలేదు. నడి వర్షాకాలంలో వేతసవిని తలపించేలా ఎండలు కాస్తున్నాయి. నీటి ఎద్దడితో పంటలకు తడిలేదక దెబ్బతింటున్నాయి. వరిచేలు బీటలు తీసి మెనలు ఎండిపోతున్నాయి. ఆరు ఎకరాల్లో వరి పంట వేశాను. మోటార్లు సరిగా తిరగకపోవడం, తక్కువ నీరు తక్కువ వస్తున్నాయి. వర్షాలు పడకపోతే ఖరీఫ్ సాగు గట్టెక్కడం కష్టమే. కాలువకు నీరు విడుదలలో ప్రభుత్వం జాప్యం చేయడం వల్ల నీటి ఎద్దడి ఏర్పడింది.

– కర్రి మురళీకృష్ణారెడ్డి, రైతు, కృష్ణంపాలెం, దేవరపల్లి మండలం

## క్లుప్తంగా

### నైపుణ్యాలను పెంచుకుంటే ఉన్నత అవకాశాలు



వేగేశ్వరపురంలో బహుమతులు అందుకున్న విద్యార్థులు

**తాళ్లపూడి:** విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవడం ద్వారా ఉన్నత అవకాశాలను పొందవచ్చని ఎంఈఓ, ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ బాలామణి పేర్కొన్నారు. వేగేశ్వరపురం కేఎస్ఆర్‌ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద బుధవారం ప్రపంచ యువత నైపుణ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఒకేషనల్ కోర్సుల విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు, ప్రశంసా పత్రాలను ఎంఈవో బాలామణి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో బాలామణి మాట్లాడుతూ విద్యార్థులకు ఇప్పటి నుంచే ఒకేషనల్ కోర్సులు అందజేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఒకేషనల్ శిక్షకులు ఎస్.సతీష్, నాగపోసి కుమార్, వ్యాయమ ఉపాధ్యాయుడు లక్ష్మణ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ ఆసుపత్రిలో సుఖ ప్రసవాలు



సమిశ్రగూడెం పీహెచ్‌సీలో వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న వెంకటేశ్వరరావు

**నిడదవోలు రూరల్:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సుఖ ప్రసవాలు పెంచేలా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు సూచించారు. సమిశ్రగూడెం పీహెచ్‌సీని బుధవారం సందర్శించారు. బంగారు కుటుంబం, ల్యాబ్, మందుల లభ్యతను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా గ్రామాల్లో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని ఆయన ఆదేశించారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎం.శివాజీ, ఎం.శ్రీనిధి, సిబ్బంది పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ కేంద్రానికి ఎల్ఈడీ టీవీలు

**తాళ్లపూడి(కొవ్వూరు):** నందమూరు గ్రామంలో బుధవారం కోడ్ నంబర్ 82 అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన రెండు ఎల్ఈడీ టీవీలను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఆయన పిల్లలకు పౌష్టికాహారం అందుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, సీడీపీవో, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

### కోటసత్తెమ్మను దర్శించుకున్న ఎమ్మెల్సీ



ఎమ్మెల్సీ సోము వీర్రాజుకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

**నిడదవోలు రూరల్:** తిమ్మరాజుపాలెం గ్రామంలోఉన్న కోటసత్తెమ్మ అమ్మవారిని ఎమ్మెల్సీ సోము వీర్రాజు బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీర్రాజుకు ఆలయ ఫౌండర్, ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రవిశంకర్, ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిప్రకాష్ అమ్మవారి చిత్రపటాన్ని అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## శాంతియుత జీవనానికి ‘మధ్యవర్తిత్వం’

**తాళ్లపూడి(కొవ్వూరు):** శాంతియుత జీవనానికి మధ్యవర్తిత్వం సులువైన మార్గమని చైర్మన్ 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.అనురాధ అన్నారు. కొవ్వూరులో బుధవారం రాష్ట్ర న్యాయధికార సంస్థ ఆదేశాల మేరకు మధ్యవర్తిత్వంపై బైక్ ర్యాలీతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ కొవ్వూరు వారి ఆధ్వర్యంలో చైర్మన్ 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.అనురాధ అధ్యక్షతన న్యాయవాదులతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. కొవ్వూరు కోర్ట్ ప్రాంగణం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్, డీఎస్పీ ఆఫీస్ మీదుగా రైల్వేస్టేషన్, విజయ్ విహార్ సెంటర్ వరకు న్యాయ వాదులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు జిల్లా జడ్జి అనురాధ మాట్లాడుతూ దీర్ఘ కాలిక సమస్యలపై పోరాడుతున్న కక్షిదారుల మధ్య మనస్పర్థలు లేకుండా సత్వర న్యాయ కోసం మధ్యవర్తిత్వం ద్వారా సమన్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జీవీఎల్ సరస్వతి, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి జి.సాయికృష్ణ బార్ ప్రెసిడెంట్, వి.నాగమధు, న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.



కొవ్వూరులో న్యాయవాదుల బైక్ ర్యాలీ

### మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం

**నిడదవోలు:** జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు నిడదవోలు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిడదవోలు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో రెహమాన్ అడిషనల్ సివిల్ జడ్జి ఖ్వాజా రెహమాన్ అధ్యక్షతన మధ్యవర్తిత్వంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.మెహబూబ్, సీనియర్ న్యాయవాదులు ఎం.రవికుమార్, పి.వీరాంజనేయచౌదరి, ఎ.సతీష్‌కుమార్, ఎంవీకే రాజేశ్వరరావు, జమీల, ప్రసన్న, ఎం.వెంకటేశ్వరరావు, ఎస్సై జగన్‌మోహన్‌రావు పాల్గొన్నారు.

## రేపు బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం

**నల్లజర్ల:** ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై ఉందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం చెప్పారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు తమ నివాసంలో ముండల కార్యకర్తల సమావేశం జరుగుతుందని మాజీ మంత్రి, గోపాలపురం నియోజకవర్గ కన్వీనర్ తానేటి వనిత ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమం నిర్వహణపై ముఖ్య నాయకులతో బుధవారం సాయంత్రం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పేరుతో చంద్రబాబు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. రెడ్‌బుక్ రాజ్యాంగమే పరమావధిగా మహిళలు, దళితులపై అత్యాచారాలు జరుగుతున్నా పట్టించుకునే దిక్కులేదన్నారు. కూటమి ఏడాది పాలనపై ప్రజలలో తీవ్ర వ్యతిరేకత మొదలైందన్నారు. గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతం కోసం గ్రామ కమిటీల ఏర్పాటును త్వరితగతిన పూర్తి చేయాలని పార్టీ శ్రేణులకు ఆయన విజ్ఞప్తి చేశారు. నాయకులు బంక అప్పారావు, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు నక్కా పండు, మండల బీసీ సెల్ అధ్యక్షుడు చిన్నీ నాగూయాదవ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు అందుగుల వెంకటేశ్వరావు ఉన్నారు.



వెల్లంకి ఇంటి వద్ద సమీక్షిస్తున్న నాయకులు

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**ఉండ్రాజవరం:** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, గృహాల్లో వాడే తడి, పొడి చెత్తను వేర్వేరుగా గ్రామ అంబాసిడర్లకు అందజేయాలని ప్రజలను ఎంపీడీవో వి.రామారావు కోరారు. నమస్తే కార్యక్రమంలో భాగంగా మండలంలో 15 గ్రామ పంచాయతీల్లో సర్పంచుల ఆధ్వర్యంలో బుధవారం పారిశుధ్య కార్మికులకు పారిశుధ్య కిట్లు అందజేశారు. ఈసందర్భంగా వడ్లూరు, తాడిపర్రు గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో, తహసీలఆర్ పీఎన్‌డీ ప్రసాద్ కలసి పాల్గొన్నారు. వడ్లూరు ఎస్సీ, బీసీ, ఓసీ ఏరియాల్లో ఇంటింటికీ చెత్త సేకరణ ఎలా జరుగుతుందో అక్కడి వారిని అడిగి ఎంపీడీవో తెలుసుకున్నారు. ఈవోపీఆర్డీ ఆంజనేయ శర్మ మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేరుగా ఇచ్చేలా గ్రీన్ అంబాసిడర్లు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం వర్మీ కంపోస్ట్ తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. మండల శానటరీ కోఆర్డినేటర్ కత్తుల ప్రకాష్, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## కౌలు కార్డులు తప్పనిసరిగా తీసుకోవాలి

**నిడదవోలు రూరల్:** పంట సాగు చేస్తున్న కౌలు రైతులంతా తప్పనిసరిగా కౌలు కార్డులు తీసుకోవాలని వ్యవసాయశాఖ కొవ్వూరు ఏడీఏ సీహెచ్ శ్రీనివాస్ సూచించారు. మండలంలోని కోరుమామిడి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులంతా పండించిన పంటకు ఈ–క్రాప్, పంటల బీమా చేయించుకోవాలన్నారు. జీవన సేంద్రియ ఎరువును తయారు చేసే పద్ధతిని, ఎరువులు వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ, అగ్రికల్చలర్ అసిస్టెంట్లు సూర్యప్రకాష్, భానుశేఖర్, రైతులు పాల్గొన్నారు.



కోరుమామిడిలో సేంద్రియ ఎరువు తయారు చేసే పద్ధతిని వివరిస్తున్న కొవ్వూరు ఏడీఏ సీహెచ్ శ్రీనివాస్

### రేషన్ షాపుల తనిఖీ

**గోపాలపురం:** లబ్ధిదారులకు సకాలంలో రేషన్ అందించేలా డీలర్లు కృషి చేయాలని, 60ఏళ్ల దాటిని వృద్ధులు, వికలాంగులకు ఇంటికి అందించాలని జిల్లా సివిల్ సప్‌లై అధికారి బి.పార్వతి అన్నారు. కరగపాడులో బుధవారం రేషన్ షాపుపై గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తనిఖీ చేశారు. ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకూ డీలర్లు రేషన్ కార్డుదారులకు నిత్యావసర వస్తువులు అందించాలని అలా చేయని డీలర్లపై చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. అనంతరం కరగపాడు రేషన్ డీలర్‌పై వచ్చిన ఆరోపణలపై లబ్ధిదారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. ఈమె వెంట ఆర్ఐ కె.సునీత, సివిల్ సప్‌లై డీటీ కె.దివాకర్, వీఆర్వో బి.జ్యోతి ఉన్నారు.

### అంగన్‌వాడీ కార్యకర్తల పాత్ర కీలకం

**నల్లజర్ల:** చిన్నారుల మెదడులో అభివృద్ధి, సమగ్ర ఎదుగుదలలో అంగన్‌వాడీ కార్యకర్తల పాత్ర కీలకమని గోపాలపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి జి.మమ్మీ అన్నారు. నల్లజర్ల ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పిల్లల మెదడు ఆరేళ్లలోపే పూర్తవుతుందని ఈ సమయంలోనే సరైన సంరక్షణ, ప్రేరణ, అనుభవాత్మక ఆలోచన, ఆసక్తి, శ్రద్ధ, పెంపొందించాలని సూచించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తప్పని సరిగా ప్రీస్కూల్ యాక్టివిటీస్ చేయించాలన్నారు. తల్లులందర్ని గ్రూపులుగా ఏర్పాటు చేసి అవసరమైన సమాచారం మెజేస్‌ల ద్వారా తెలియజేయాలన్నారు. సెంటర్ల పనితీరు మెరుగుపర్చుకోవాలన్నారు. పోషణ వాటికలను తీర్చిదిద్ది తద్వారా వచ్చే కూరగాయలు, ఆకు కూరలు సెంటర్‌కు వచ్చే పిల్లలకు వినియోగించాలన్నారు. ప్రథమ సంస్థ ప్రతినిధి కృష్ణ పీపీ–1,పీపీ–2 విద్యార్థుల గురించి సూచనలు చేశారు. సమావేశంలో సూపర్‌వైజర్లు ఎస్.వి.కృష్ణవేణి, హారతి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

### విశ్రాంత ఉద్యోగుల నూతన కార్యవర్గం

**దేవరపల్లి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశాంత ఉద్యోగుల దేవరపల్లి మండల శాఖ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. బుధవారం స్థానిక మండల శాఖ అసోసియేషన్ భవనంలో పప్పు వెంకటరామారావు అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన జిల్లా అధ్యక్షుడు పల్లా సత్యనారాయణమూర్తి తెలిపారు. 2024–25 వార్షిక నివేదికను సమావేశంలో కార్యదర్శి గద్దే కృష్ణారావు చదివి వినిపించారు. నూతన అధ్యక్షుడిగా పప్పు వెంకటరామారావు, గౌరవాధ్యక్షుడిగా కేశిరాజు సీతారామయ్య, అసోసియేట్ అధ్యక్షులుగా షేక్ సయ్యద్ అలీ సాహెబ్, వెలిచర్ల సూర్యనారారాయణ మూర్తి, ప్రధాన కార్యదర్శిగా గద్దే కృష్ణారావు, కోశాధికారిగా చిందాడ సుగుణలత, ఉపాధ్యక్షులుగా బండి సూర్యప్రకాశరావు, ఎలమాటి సత్యనారాయణ, ఈదుపుగంటి నాగేశ్వరరావు, ఉప్పలపాటి కళావతి, కార్యదర్శులుగా వీరవల్లి శేషమణి, వై.పద్మజ, సరిశెట్టి ఈశ్వరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా హుస్సే శంకరుడు, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఆచంట సుభాష్ చంద్రబోస్ ఎన్నియ్యారు. నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. .

### అసంక్రమిత వ్యాధుల సర్వే పరిశీలన

**నల్లజర్ల:** ప్రజారోగ్యానికి సంబంధించి అసంక్రమిత వ్యాధుల సర్వేను పరిశీలించేందుకు రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగం వైద్యుల బృందం బుధవారం అయ్యవరం గ్రామాన్ని సందర్శించింది. ఆ కళాశాల మెడిసిన్ విభాగాధిపతి బి.శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యంలో 20 మంది విద్యార్థుల బృందం టీమ్‌లుగా ఏర్పడి ప్రజల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకుంటూ అసంక్రమిత వ్యాధులపై సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో అసోసి యేట్ ప్రొఫెసర్లు ఏవీ దుర్గాప్రసాద్, డాక్టరు ఫణిమాధవి, డాక్టరు సూర్యారావు, సురేంద్రబాబు, దీప్తి, సీనియర్ రెసిడెంట్ ట్యూటర్లు శాస్త్రి, మూర్తి, ప్రసన్న, ఆర్.శ్రీనివాస్, నల్లజర్ల పీహెచ్‌సీ డాక్టరు గంగాధరావు, సీహెచ్‌ఓ నేమాని వెంకటశాస్త్రి పాల్గొన్నారు.

### సారా రహిత మండలంగా నిడదవోలు

**నిడదవోలు రూరల్:** మండలంలోని 23 గ్రామాల్లో గత నాలుగు నెలలుగా ఒక్క సారా కేసు నమోదు కాకపోవడంతో సారా రహిత మండలంగా గుర్తించినట్టు నిడదవోలు ఎక్సైజ్ సీఐ ఆర్.జైరామ్ సతీష్ తెలిపారు. నిడదవోలు తహసీల్దార్ కార్యాలయంలో సారా రహిత మండల ఫ్లెక్సీని మండల స్థాయి అధికారులు బుధవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా నిడదవోలు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఉన్న తాడిమళ్ల, కోరుమామిడి, మునిపల్లి, గ్రామాల్లో గతంలో నమోదైన సారా కేసుల నిందితుల ప్రస్తుత స్థితిగతులను పరిశీలించడంతోపాటు వారి జీవనభృతి కోసం వేరే వృత్తుల్లో స్థిరపడ్డారన్నారు. ఆయా గ్రామ కమిటీలు క్షుణ్ణంగా పరిశీలించి రహిత మండలంగా ప్రకటిస్తున్నామని చెప్పారు. తహసీల్దార్ బి.నాగరాజునాయక్, ఎంపీడీఓ వీఎస్‌వీఎల్ జగన్నాథరావు, సమిశ్రగూడెం ఎస్సై ఎల్.బాలాజీ సుందరరావు, ఎక్సైజ్ ఎస్సై బాలాజీ, సిబ్బంది పాల్గొన్నారు.

### వసతి గృహాల పరిశీలన



కానూరు బాలుర వసతిగృహాన్ని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ, ఎంపీపీ

**పెరవలి:** ప్రతి శుక్రజువారం మాస్ క్లీనింగ్ డ్రై డేగా పాటించి వసతి గృహాల్లోని పరిసరాలను శుభ్రం చేయాలని ఎంపీడీఓ కె.పద్మజ సిబ్బందిని ఆదేశించారు. పెరవలి మండలంలోని ఖండవల్లి, కానూరు వసతి గృహాలను బుధవారం పరిశీలించి సిబ్బందితగు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం రావడంతో పరిసరాలు అన్ని పిచ్చి మొక్కలు ఎదగడం వలన అనే ఇబ్బందులు తలెత్తుతాయి అందుకే ముందస్తుగా విద్యార్థులకు ఎటువంటి అవరోధం కలగకుండా వసతి గృహాల్లో శుభ్ర పరుస్తామన్నారు. ఎంపీపీ కార్నెర్ల ప్రసాద్ విద్యార్థులకు మెనూ ప్రకారం అన్ని అందుతున్నాయా అంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయితీ కార్యదర్శులు ఎన్ఆర్‌జిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.







## సామాజిక తనిఖీలో బయటపడిన అక్రమాలు

- జరిగిన పనుల్లో రూ.53.61 లక్షల అవినీతి
- రూ.25 లక్షల విలువ చేసే పనులు తిరిగి చేపట్టాలి
- మరో రూ.16 లక్షల విలువ చేసే పనులపై విచారణకు ఆదేశం
- చాగల్లులో ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక
- డ్వామా పీడీ నాగమల్లేశ్వరరావు




సోషల్ ఆడిట్ ప్రజా వేదిక సభలో వివరాలను చదువుతున్న ఆడిట్ సిబ్బంది

**చాగల్లు:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని డ్వామా పీడీ నాగమల్లేశ్వరరావు తెలిపారు. మండలంలో గత ఆర్థిక సంవత్సరంలో రూ. 7.5 కోట్లతో 971 పనులు జరిగాయి. వీటికి సంబంధించి గత వారం రోజులుగా గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందం నిర్వహించిన పనులపై చాగల్లు మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం సోషల్ ఆడిట్ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సభకు ఎంపీపీ మట్టా వీరాస్వామి అధ్యక్షత వహించారు. ఈ సభకు డ్వామా పీడీ నాగమల్లేశ్వరరావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జరిగిన పనుల్లో రూ.53.61 లక్షలు మేర తేడాలు జరిగినట్టు సామాజిక తనిఖీ బృందం గుర్తించిందన్నారు. వీటిలో రూ. 1.17 లక్షలు రికవరీ చేయాలని ఆదేశించారు. రూ.25 లక్షలు విలువ చేసే పనులు తిరిగి చేయాలని ఆదేశించారు. మరొక రూ.16 లక్షలు విలువ చేసే పనులపై ఏపీడీ ఆధ్వర్యంలో విచారణ చేయించాలన్నారు. ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పనులకు సంబంధించి కొలతలు, ఎం.బుక్ రికార్డులు సక్రమంగా ఉండాలని సూచించారు. ఈ సభకు విచ్చేసిన మరో ముఖ్య అతిథి డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీఎస్ మూర్తి మాట్లాడుతూ సామాజిక భద్రత పెన్షన్లు లబ్దిదారుల ఇంటి వద్దనే ప్రతి నెలా అందజేయాలని సూచించారు. సామాజిక తనిఖీ బృందం ఎస్ఆర్‌పీ బి.సూర్యచంద్ర మాట్లాడుతూ పంట కాలువలు లేనివి ఉన్నట్టుగా చూపించడం, కొలతలలో భారీగా తేడాలు గుర్తించామన్నారు. వర్క్ బోర్డులు ఏర్పాటు చేయకపోవడం, ఉపాధి హామీలో నాటిన మొక్కలు నిర్వహణ సక్రమంగా లేకపోవడం వంటి అనేక అవకతవకలు గుర్తించినట్టు చెప్పారు. ప్రభుత్వం నుంచి గౌరవ వేతనం తీసుకునే కొంత మంది ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పింఛన్లు తీసుకున్నట్టు గుర్తించామన్నారు. ఉపాధి పనులు జరిగే ప్రదేశంలో కనీస వసతులు కూడా ఏర్పాటు లేదని ఫిర్యాదులు అందినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్సు అధికారి రత్నకుమారి, ఎంపీడీవో ఆర్.శ్రీదేవి, ఏపీడీ బి.రామ్ ప్రసాద్, అంబుడ్స్ పర్సన్ ఖాదర్ బాషా, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ బృందం సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.